# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 19 జూన్ 2025 | పేజీలు 8

- దుండిగల్ మున్సిపల్ బహుదూర్‌పల్లి చెరువు నాలా కబ్జాలో కీలక మలుపు..
- 2019లో సర్వేయర్ శ్రీనివాస్‌చారి తప్పిదం ప్రైమార్క్‌కి పర్మిషన్ గ్రాంటెడ్..
- 2023లో మరో సర్వేయర్ నాలా ఆక్రమణపై నివేదికతో బయటపడిన నాలా కబ్జా..
- 2000 గజాల నాలా కబ్జాను కట్టబెట్టేందుకు యంత్రాంగం సమన్వయంతో సహకారం..
- చిన్న చిన్న నాలా ఆక్రమణలు, తొలగించిన "హైడా" కమిషనర్.. ప్రైమార్క్‌లో సైలెంట్..?
- బాహుబలి బుల్డోజర్‌లతో బడా నిర్మాణాలు కూడా నేలమట్టం చేసిన "హైడ్రా అధికారులు".
- బహుదూర్‌పల్లి చెరువు నాలా కబ్జాపై చర్యల కాలయాపనలో "మతలబ్" ఏంటి..?
- ప్రైమార్క్ నిర్మాణ సంస్థ 88 ఫ్లాట్‌ల హైరైజ్ టవర్‌ను కాపాడే యత్నమా..?
- ఏడుగురు అధికారుల సంతకాలతో "జాయింట్ ఇన్‌స్పెక్షన్" నివేదిక సిద్ధం..
- అధికారులు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే నని తప్పుడు నివేదికతో నిరూపణ..
- విలేజ్ మ్యాప్‌ను పక్కనపెట్టి, టోపోషీట్‌కే ప్రాధాన్యత..!
- నాలా కబ్జాపై హైకోర్టును ఆశ్రయించిన బాధితుల విల్లాల మీదుగానే మళ్ళింపు..
- బాధితులపై "ముల్లును ముల్లుతోనే" తీసే అస్త్రం ప్రయోగించిన అధికారుల కూటమి..
- ఇకపై నాలా స్థలం ప్రైమార్క్‌కి సొంతం చేయడానికే నివేదిక సిద్ధం చేశారా..?
- ప్రైమార్క్ నాలా కబ్జాను కాపాడేందుకు కొత్తగా రెండు నాలాల పునరుద్ధరణ..

ప్రైమార్క్ హైరైజ్ టవర్‌ల కింద భూ స్థాపితం అయిన నాలా ఇదే.. ఫైల్‌ఫోటో..




# ప్రైమార్క్‌కి "సక్రమం" చేసేవరకు..!

# "అక్రమ" నివేదికలేనా..?

### నాలా కబ్జాలో ప్రైమార్క్‌ను రక్షించేందుకు..! అధికారుల "పాశుపతాస్త్రం" సిద్ధం..?

శతాబ్దపు కాలంనాటి చారిత్రక లేక్ఐడి 2856 బాబాఖాన్ చెరువు నాలా స్థలం 2000 గజాలు కబ్జాచేసిన అక్రమార్కులకు..! సహకరించడానికి "అన్ని శాఖల అధికారులు ఏకమయ్యారా..? అక్రమాన్ని సక్రమం చేయడానికి, శతవిధాలు ఆలోచించి, నాలా దారి మళ్ళింపా..? కబ్జా చేసిన స్థలంపై నిర్మించిన సుమారు "రూ.70 కోట్లు" విలువైన 88 ఫ్లాట్‌లు గల "ప్రైమార్క్ ఎ-బ్లాక్" హైరైజ్ టవర్‌ను కాపాడే లక్ష్యంగా తప్పుడు నివేదికలపై విమర్శలు..! ఎవరి లాభాపేక్ష కోసం ప్రైమార్క్ నాలా కబ్జాను ప్రోత్సహిస్తున్నారు..? అప్పుడు హెచ్ఎండిఏ అనుమతులకు, ప్రధాన కారణం దుండిగల్ సర్వేయర్ తప్పుడు స్కెచ్ మ్యాప్.. ఇప్పుడు ప్రైమార్క్‌కి "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీ చేయడానికి కారణం, ఇరిగేషన్ అడ్డుకోక పోవడమే..! హైకోర్టు ఆదేశాలతో కబ్జా సమస్యను పరిష్కరించేందుకు హైడ్రాను ఆదేశించగా..! హైడ్రా ఏకపక్ష ధోరణితో (ప్రైమార్క్‌కి అనుకూలంగా) నిర్ణయం తీసుకుంటుందని, అందుకు "హెచ్ఎండిఏ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీ చేయడమే నిదర్శనంగా బాధితులు ఆరోపిస్తున్నారు.. హైడ్రా కమిషనర్ మార్చి 13న ప్రైమార్క్‌ను సందర్శించిన వారం రోజుల్లో 19వ తేదిన "హెచ్ఎండిఏ ఆక్యుపెన్సీ" జారీ చేయడం..! ఆ వెంటనే ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ సమన్వయంతో నాలా దారి మళ్ళింపు ప్రక్రియను వేగవంతం చేయడం..! ఏడుగురు అధికారుల సంతకాలతో నివేదిక సిద్ధం చేశారంటే అర్ధం..? తీసుకున్న ముడుపులకు న్యాయం చేయడానికి..? శాఖల సమిష్టి కృషి అనుకోవాలా..? దేనిని పరిగణలోకి తీసుకుని నివేదిక సిద్ధం చేశారు..? టోపోషీట్‌ను తప్పుబట్టడం లేదు.. కానీ అదే సమయంలో విలేజ్ మ్యాప్ లెక్కలో లేదా..? బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 188, 189, 191, 210 మీదుగా ప్రవహించిన నాలా కబ్జా కథ కంచికేనా..? ఓవైపు నగరంలో నాలాల కబ్జాలపై ఫిర్యాదు చేయమని చెబుతున్న "హైడ్రా" (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏ.వి.రంగనాథ్" ప్రైమార్క్ హైరైజ్ టవర్‌ల కింద ఉన్న నాలా కబ్జాపై, ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి..!

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 18:**



బహుదూర్‌పల్లి బాబాఖాన్ లేక్ఐడి నెం.2856 చెరువు నాలాపై ప్రైమార్క్ హైరైజ్ టవర్‌లు..

-2లో



మూసేసిన చెరువు నాలాపై ప్రైమార్క్ నిర్మాణం సెల్లార్‌లో చిన్న పైపులైన్.. హైకోర్టుకి సమర్పించిన ఫైల్‌ఫోటోలు..

# తొలకరి కంటే ముందే..! పలకరించిన రైతు భరోసా..!

### రైతుల ముఖాల్లో సంతోషాన్ని నింపిన తెలంగాణ ప్రభుత్వం: కలెక్టర్ మను..

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4,291 మంది రైతుల ఖాతాల్లో రూ.2.57 కోట్లు జమ..
- రైతు సంతోషానికి ప్రభుత్వం యాసంగి సీజన్ కంటె ముందే రైతుల ఖాతల్లో నిధులు..
- రైతుల ఖాతల్లో నిధుల జమ..రైతుల ఉజ్వల భవిష్యత్తుకు,ఇదో మచ్చు తునక..

-3లో



# బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోండి




**హైదరాబాద్ పెన్ పవర్:** సూపర్ సోనిక్ క్రూ యిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను హైదరాబాద్ లో విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను కోరారు. డిఫెన్స్ కారిడార్ ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలు అనుకూలమైనవన్నారు సీఎం. ఇప్పటికే హైదరాబాద్ లో పలు డిఫెన్స్ సంస్థలున్నాయన్న సీఎం.. బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించేందుకు హైదరాబాద్ ను ఎందచుకోవాలని, ప్రభుత్వం అన్ని విధాలా

-3లో

# ప్రైమార్క్‌కి "సక్రమం" చేసేవరకు..! "అక్రమ" నివేదికలేనా..?




హైకోర్టు ఆదేశాలతో, హైడ్రా కమిషనర్ 2025 మార్చి 13న ప్రైమార్క్‌ను సందర్శించిన.. ఫైల్‌ఫోటో..




2023లో నాలా కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్ సర్వేలో.. పూడ్చేసిన నాలాపై నిలబడిన అధికారులు..



బాబాఖాన్ చెరువు వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ సర్వే 2023.. ఫైల్‌ఫోటో..

-

**నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులకు ఆహ్వానం పలుకుతున్న హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్.. నాలాల ఆక్రమణలపై ప్రత్యేకంగా "జూన్-జులై" నెలల్లో, ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించేందుకు హైడ్రా నిర్ణయించింది.. హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులు కూడా కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి.. పాత ఫోటోలు, ప్రస్తుత ఫోటోలతో జతచేసి ఫిర్యాదు చేయమని చెబుతున్న హైడ్రా అధికారులు.. దుండిగల్ మండలం బహుదూర్‌పల్లి బాబాఖాన్ లేక్‌ఐడి నెం.2856 చెరువు నాలా "17 గుంటలు (2000 గజాలు) ఆక్రమణలో ప్రైమార్క్ నిర్మాణాలు ఉన్నాయని, హైకోర్టు ఆదేశాలతో, ప్రైమార్క్‌ను సందర్శించిన హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ గ్రహించారు.. ఆయన సందర్శించి వారం తిరగక ముందే..! హెచ్‌ఎండిఏ నుండి "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీచేయడం, బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. మరోవైపు ప్రైమార్క్ నాలా కబ్జా సెల్లార్‌లో పైపులైన్ ఫోటోలు బాధితులు హైకోర్టుకు సమర్పినవి, నేటి పెన్ పవర్ దినపత్రికలో చూడవచ్చు..**

## పథకం ప్రకారమే అధికారుల ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్..

"మూలిగే నక్కమీదే తాటికాయ పడటం అంటే ఇదేనేమో"..! ఒక కబ్జాదారున్ని రక్షించడానికి వివిధ శాఖలకి చెందిన అధికారుల నిర్వాకం, బాధితులను మరింత ప్రమాదంలో పెడుతుంది.. మరోవైపు పక్కా పథకం ప్రకారమే శాఖల సమన్వయంతో చేపట్టిన ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్, ప్రైమార్క్ నిర్మాణ సంస్థ చెరువు నాలా కబ్జా తీవ్రతను తగ్గించి, చర్యలు లేకుండా సహకరించే విధంగా ఉన్నాయని స్పష్టమవుతుంది.. నివేదికలో పేర్కొన్న పలు అంశాలు అధికారుల అవగాహనా రాహిత్యాన్ని ఎత్తి చూపుతోందా..? అధికారుల ప్రధాన ఆరోపణల్లో..! ఇరిగేషన్ "ఎన్‌వోసి" కోరకుండానే 2019లో హెచ్‌ఎండిఏ ప్రైమార్క్ సంస్థకు "కన్‌స్ట్రక్షన్ పర్మిషన్" మంజూరు చేసిందని..! 2025 మార్చి 19న (హైడ్రా కమిషనర్ సందర్శన అనంతరం)
"ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీచేసిందని..! అధికారుల "ఉమ్మడి తనిఖీ నివేదికలో" పేర్కొన్నారు..

మొదటి
**పేజి తరువాయి**

ప్రైమార్క్ హైరైజ్ టవర్‌ల కింద ఉన్న 17 గుంటలు (సుమారు 2000 గజాలు) ఇక కబ్జాకే వదిలేస్తున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.. బహుదూర్‌పల్లి లేక్‌ఐడి నెంబర్ 2856 బాబాఖాన్ చెరువు నాలా ఆక్రమణను గుర్తించిన సర్వేయర్ తప్పు చేసినట్టా..? లేక.. విలేజ్ మ్యాప్‌లో ఉన్న, సర్వే నెంబర్ 188, 189, 191, 210 మీదుగా ప్రవహించిన నాలాను చూపించకుండా, ప్రైమార్క్ నిర్మాణాలకు, హెచ్‌ఎండిఏ అనుమతులు లభించేందుకు సహకరించిన సర్వేయర్ తప్పు చేసినట్టా..? అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.. పలుకుబడి ఉన్న బడా నిర్మాణ సంస్థకు అధికారులు బహుమానంగా ఈ నాలా స్థలాన్ని ప్రైమార్క్‌కి కట్టబెడుతుందా .?

అసలు సిస్టమే సరిగ్గా లేదా..? ఆ సిస్టమ్‌లో చీడ పురుగులు దాపురించాయా..? అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. "ఆపరేషన్ హైడ్రా" నాలాలు పరిరక్షించడం అంటే ఇదేనా..? బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయకుండా.. నాలాలు దారిమళ్ళిస్తే అర్ధం..! కబ్జాకు గురైన, ఆ 17 గుంటల చెరువు నాలా సంగతేంటి..? "మనం మనం బరంపురం" అంటూ అధికారులు అందరూ, తమ తప్పిదాలని కప్పిపుచ్చుకుని, ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కులకు కట్టబెడతారా..? ఇందులో ఎవరివాటా ఎంత..? అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. నాలా సమస్య పరిష్కరించమని హైకోర్టు ఆదేశాలకు అర్ధం ఏంటి..? నాలా దారిమళ్ళించి, కబ్జాకు గురైన నాలా స్థలం ప్రైమార్క్‌కే అప్పగించమని అర్ధమా..?

## పంట పొలాలు లేకపోతే..! నాలాలు పూడ్చేస్తారా..?

బాబాఖాన్ లేక్‌ఐడి నెం.2856 చెరువుకు రెండు తూములు ఉన్నాయని, అవి మూసుకు పోయాయని నివేదికలో పేర్కొన్న ఇరిగేషన్.. అవి ఎందుకు పునరుద్ధరించ లేదు..? పంటపొలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే చేసుకోవాలి.. కానీ పంట కాలువలు, ఓపెన్ నాలాలు పూడ్చేయాలని ఏ చట్టంలో ఉందో నీటిపారుదల అధికారులు చెప్పాలి.. బడా నిర్మాణ సంస్థలకు అమ్ముడు పోయిందే కాక..! పోలాలు లేవని, కాలువలు మూసేశారని చెప్పడం అధికారుల బాధ్యతా రహతం కాదా..? రహదారి పనుల్లో భాగంగా, నాలాను మూసేస్తుంటే ఇరిగేషన్ చోద్యం చూసిందా..? సూరారం లింగం లేక్‌ఐడి నెం.2819 చెరువుకు వెళ్ళే కట్టుకాలువ కబ్జాకు గురైనా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు..! ప్రైమార్క్‌ను కాపాడేందుకు లింగం చెరువుకు రెండు నాలాలు పునరుద్ధరిస్తారట.. అడిగేవారు లేకపోతే బరితెగించి విధులు నిర్వర్తిస్తారా..? బాధ్యతలేని సంబంధిత అధికారులను సస్పెండ్ చేయడంలో తప్పేముంది..?

## 2019లో ఇరిగేషన్ వ్యవస్థ లేదా..? పర్మిషన్ ఎలా వచ్చింది..?

హెచ్‌ఎండిఏ పై లోపాన్ని చూపుతున్న అధికారుల బృందం.. ఇరిగేషన్ బాధ్యతా రహితాన్ని పేర్కొనక పోవడం బాధాకరం.. హెచ్‌ఎండిఏ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లు జారీచేస్తుంటే..! చెరువుల పరిరక్షణకై నియమించిన నీటిపారుదల శాఖ ఏం చేస్తుంది..? ఆరేళ్ళుగా ఇరిగేషన్ వ్యవస్థ లేదా.. అధికారులకు బాధ్యతలు లేవా..? అప్పుడు అనుమతులు అడ్డుకోలేదు..! ఇప్పుడు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ అడ్డుకోలేదు..! ముడుపులు పుచ్చుకున్నారా..? ఇంత బహిరంగ సమాచారాన్ని "హైడ్రా కమిషనర్" కూడా గమనించలేదని నమ్మవచ్చా..?

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4,291 మంది రైతుల ఖాతాల్లో రూ.2.57 కోట్లు జమ..
- రైతు సంతోషానికి ప్రభుత్వం యాసంగి సీజన్ కంటె ముందే రైతుల ఖాతల్లో నిధులు..
- రైతుల ఖాతల్లో నిధుల జమ..రైతుల ఉజ్వల భవిష్యత్తుకు,ఇదో మచ్చు తునక..




# తొలకరి కంటే ముందే..! పలకరించిన రైతు భరోసా..!



మిక్కిలినేని మను చౌదరి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..

## రైతుల ముఖాల్లో సంతోషాన్ని నింపిన తెలంగాణ ప్రభుత్వం: కలెక్టర్ మను..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 18:**తొలకరి కంటె తొందరగానే.. రైతు భరోసాతో రైతుల ఖాతాల్లోకి నిధులు జమచేసి..! రైతుల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు.. బుధవారం రైతు భరోసా పథకం ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4291 మంది రైతుల ఖాతాల్లో రూ.2.57 కోట్లు జమ అయిన సందర్భంగా కలెక్టర్ మను ప్రకటన జారీచేశారు.. రైతుల ముఖాల్లో సంతోషం కోసం రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్ కంటె ముందుగానే రైతుల ఖాతల్లో నిధులు జమ చేయడం, రైతుల ఉజ్వలమైన భవిష్యత్తుకు, ఇదో మచ్చు తునక అన్నారు.. విడతల వారిగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు.

---

గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం అధ్యక్షుడు దండుగుల స్వామి మనీషా జన్మదిన సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత దండుగుల మనీషాను నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఉండాలని వారిని ఆశీర్వదిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. వారితో పాటు కుటుంబ సభ్యులు దండుగుల శశిధర్, చరణ్ రాజ్ పాల్గొన్నారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 18**



కల్వకుంట్ల కవితతో దండుగుల మనీషా స్వామి కుటుంబ సభ్యులు..

---

# బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోండి

- మొదటి పేజి తరువాయి

సహకరిస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధుల బృందం బుధవారం(జూన్ 18) సీఎం రేవంత్?రెడ్డితో భేటీ అయ్యింది. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డి,ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈవో డా.జైతీర్థ్ ఆర్.జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివప్రసాద్, DRDL డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు.

# భూ భారతిలో..! సర్వేయర్ల పాత్ర కీలకం..!

## మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

### లైసెన్స్ సర్వేయర్‌ల శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి..







**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,** రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన, భూ భారతి చట్టం రైతులకు చుట్టంగా మారుతుందని, ఈ ప్రక్రియలో లైసెన్స్ సర్వేయర్లు కీలక పాత్రవహిస్తారని జిల్లా అదనపు కలెక్టర్ విజేయేందర్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిదిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు, తదితర అంశాలపై అనుభవం కలిగిన నిపుణులైన వారిచే శిక్షణా కార్యక్రమాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. సైసెన్స్ సర్వేయర్లు భూ భారతి చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లైసెన్స్ సర్వేయర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతలు 45 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సర్వేయర్లు లు శ్రద్దగా విని, శిక్షణను సద్వినియోగం పర్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులలో వారి వారి నైపుణ్యాన్ని పెంపొందించుకొని భూ భారతి చట్టం అమలులో మీ సేవలను అందించాలన్నారు. భూ భారతి చట్టం అమలులో మీ సేవల ద్వారా ప్రజల, రైతుల సమస్యలను పరిష్కరించడంలో, ముందుండి అంకితభావంతో పని చేయాలన్నారు. మీరు చేసే పనులతో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాదగిరి రెడ్డి, డిఐఓ బలరాం, లైసెన్స్ సర్వేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## సుమారు రెండు నెలల తర్వాత.. పహల్గాం ఇప్పుడు ఎలా ఉంది?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్ లోని పహల్గాంలో గల బైసరన్ లోయలో పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందిస్తూ ఉన్నారు. ఇలా.. పెద్దలు, పిల్లల కోలాహలంతో ఆ ప్రకృతి ఒడి మరింత రమణీయంగా, సందడిగా మారిపోయింది. సరిగ్గా ఆ సమయంలో తుపాకీ చప్పుడు వినిపించింది. ఒక్కసారిగా అక్కడున్న ప్రతీ పర్యాటకుడి ఉత్సాహం మొత్తం మారిపోయింది. ఎటునుంచి వచ్చిందో తెలియదు ఉగ్రమూక, ఏ మూలన నక్కిందో తెలియదు దుష్టమూక.. ఒక్కసారిగా పర్యాటకులపై విచురుకుపడింది రాక్షసమూక. అక్కడున్న మగాళ్ల మతం అడిగింది.. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులు జరిపింది.. ఈ క్రమంలో 26 మంది మహిళల సిందూరాన్ని చెరిపింది! దీంతో.. అప్పటి వరకూ ఉత్సాహంగా ఉన్న ప్రాంతమంతా రక్తసిక్తమైంది. జమ్మూకశ్మీర్ పర్యాటకంగా సురక్షితం కాదని సందర్శకులను నమ్మించడానికి.. తద్వారా పర్యాటకంపై అధికంగా ఆధారపడిన ప్రాంత ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయడానికి ఓ రాక్షస ప్రయత్నాన్ని ఎంచుకుంది. అయితే వారి ప్రయత్నం ఆయుష్ను రెండు నెలలు కూడా లేదు! ప్రస్తుతం పహల్గాంలో సందడి వాతావరణం నెలకొంది.. ప్రకృతి రమణీయానికి పూర్వ వైభవం వచ్చేసింది. అవును... పహల్గాం ఉగ్రదాడి అనంతరం తాజాగా జమ్మూకశ్మీర్ లో మళ్లీ పర్యాటకుల సందడి మొదలైంది. ఇందులో భాగంగా... తాజాగా 16 పర్యాటక ప్రదేశాలు తిరిగి తెరవబడ్డాయని తెలుస్తోంది. ఇందులో 8 జమ్మూలోవి కాగా.. 8 కాశ్మీర్ లోవి! వీటిలో ప్రధానంగా.. బేతాబ్ లోయ, వెరినాగ్, కోకెర్నాగ్, అచాబల్ లోని మొఘల్ తోటలు ఉన్నాయి.

ఈ సందర్భంగా స్పందించిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా... పహల్గాం ఉగ్రదాడి తర్వాత మూసివేయబడిన సుమారు నాలుగు డజన్ల సైట్ లను దశలవారీగా తిరిగి తెరుస్తున్నామని ప్రకటించారు. పైగా.. గత నెలలో సీఎం ఒమర్ అబ్దుల్లా.. పహల్గాంలోనే క్యాబినెట్ మీటింగ్ నిర్వహించి.. పర్యాటకులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇదే సమయంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన కత్రా %-% శ్రీనగర్ వందే భారత్ ఎక్స్ ప్రెస్ పర్యాటక రంగానికి పెద్ద ఊపినిచ్చిందని అంటున్నారు! ఈ సమయంలో.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ బ్రిడ్జ్ పై ప్రయాణించే అవకాశం కోసం పర్యాటకులు క్యూలో ఉన్నారు. దీంతో.. పర్యాటకంగా ఆ ప్రాంతానికి పూర్వ వైభవానికి మించిన మొదలైనట్లేనని అంటున్నారు!

## చంద్రబాబు.. కేంద్రంలో పలుకుబడి ఉందనుకోవద్దు.. బనకచర్ల ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉంది కదా అని.. అన్ని ప్రాజెక్టులకు అనుమతి వస్తుందనుకోవద్దన్నారు. అన్ని ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయనుకోవడం చంద్రబాబు భ్రమే అవుతుందన్నారు. బనకచర్లను ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసన్నారు. తమ హక్కుల కోసం ఎక్కడా రాజీపడబోమన్నారు రేవంత్ . తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడుతామన్నారు. తమ హక్కులు అడ్డు వస్తే రాజకీయంగా పోరాడుతాం, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు రేవంత్. మోదీకి చంద్రబాబు,చంద్రబాబుకు మోదీ అవసరం ఉందన్నారు. ఇద్దరు పరస్పరం సహకరించుకుంటున్నారని చెప్పారు రేవంత్.

కృష్ణా బేసిన్ లో 500 టీఎంసీలకు, గోదావరి బేసిన్ లో 1000 టీఎంసీలకు ఎన్ వోసీ ఇస్తే బనకచర్లకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పబోమన్నారు రేవంత్. తమ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా మిగులు జలాలు ఉన్నాయంటున్నారు..కృష్ణా జలాల్లో పదేళ్లలో 299 టీఎంసీలు ఏనాడైనా వాడారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల ఏపీకి నీళ్లు వస్తున్నాయన్నారు రేవంత్. ఐదు నెలలుగా తెలంగాణ అభ్యంతరాలతోనే బనకచర్ల అనుమతిపై కేంద్రం పునరాలోచనలో పడిందన్నారు రేవంత్.

### ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు

# ముగ్గురు బీజేపీ ఎంపీలు?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పోన్ ట్యాపింగ్ కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణతోపాటు ఏపీకి చెందిన పలువురు నేతలు, వ్యాపార వేత్తల ఫోన్లను రహస్యంగా విన్నరన్న సమాచారం సంచలనం రేపుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణతో డొంక అంతా కదులుతోంది. ఇన్నాళ్లు అమెరికాలో ఉన్న ఆయనను ప్రభుత్వం రప్పించింది. కొద్దిరోజులుగా ఆయనను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును ఓ కొలిక్కి తీసువచ్చిందని అంటున్నారు.తమ కేసుకు ఆధారంగా పలువురు నేతల నుంచి స్టేట్మెంట్లు రికార్డు చేస్తున్నారు. 2023 నంబర్ కి ముందు ఆయా నేతల ఫోన్లను ఎస్ఐబీ అధికారులు రికార్డు చేశారని సిట్ చెబుతోంది. దాదాపు వెయ్యి మంది పోన్లు రికార్డు చేశారని చెబుతుండగా, ఆ జాబితాలో బీజేపీ ఎంపీలు పేర్లు ఉన్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ కేసును ఎలా స్వీకరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.తెలంగాణకు చెందిన ముగ్గురు బీజేపీ ఎంపీలు ఫోన్లను ట్యాప్ చేసినట్లు చెబుతున్నారు. బీజేపీలో అత్యంత కీలకమైన ఈటల రాజేందర్, రఘునందన్ రావు, అర్వింద్ ఫోన్లను రహస్యంగా విన్నారని సిట్ ఆధారాలు సేకరించింది. దీనిపై వారి నుంచి వాంగ్మూలం తీసుకోవాలని సిట్ భావించడం, వారు కూడా అందుకు సమ్మతించడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను టార్గెట్ చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ చేతులు కలిపుతాయా? అనే ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది.ఎన్నికలకు ముందు బీజేపీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఈటల, రఘునందన్, అర్వింద్ కదలికలను ఎస్ఐబీ ఎప్పటికప్పుడు తెలుసుకుందని చెబుతున్నారు. ఇప్పటికే టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ని ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా సిట్ అధికారులు పిలిచారు. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. ఇక బీజేపీ ఎంపీలు ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు సాక్ష్యంతో నిందితులకు ముప్పు ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు.స్వయంగా ఫోన్ ట్యాపింగ్ బాధితుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసును సీరియస్ గా తీసుకున్నారని అంటున్నారు. బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేశారన్న సమాచారం కేంద్రానికి పంపి, అమెరికా నుంచి ఎస్ఐబీ మాజీ అధినేత ప్రభాకర్ రావను స్వదేశానికి తెప్పించారని చెబుతున్నారు. ప్రభాకర్ రావు విచారణతో బీజేపీ నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభించడంతో కేంద్రం స్పందనపై ఉత్కంఠ నెలకొంది. చట్టరీత్యా ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరం. ఫోన్ ట్యాపింగుకు తప్పనిసరిగా కేంద్రం అనుమతి ఉండాలి. కానీ, మావోయిస్టుల ఫోన్లు వింటున్నామనే నెపంతో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, గత ప్రభుత్వంలోని తిరుగుబాటు నేతలైన ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వంటి వారి ఫోన్లను ట్యాప్ చేశారని చెబుతున్నారు.

# జగన్ పై వత్తిడి తప్పదా? ఈ సారి నేతలు పట్టుబట్టి అంగీకరింప చేస్తారా?

**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై ఈ సారి నేతల నుంచి వత్తిడి ఖచ్చితంగా పెరుగుతుంది. ఉచిత పథకాలను మరింతగా ప్రకటించాలని నేతలు ఇప్పటికే అభిప్రాయపడుతున్నారు. జగన్ హామీల విషయంలో చేతులు ముడుచు కూర్చుంటే ఈసారి కూడా అధికారంలోకి రావడం కష్టమేనని ఇప్పటికే కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఇటువంటి డిమాండ్లు ఊపందుకున్నాయి. జనం నాడిని పట్టి వెళ్లాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తామా? లేదా? అన్నది పక్కన పెట్టి అధికారంలోకి రావాలంటే ప్రజల ఆలోచనలకు అనుగుణంగా వెళ్లడం మంచిదని ఇప్పటికే నేతలు అంటున్నారంటే రానున్న కాలంలో వైసీపీ నేతల నుంచి జగన్ పై మరింత వత్తిడి పెరిగే అవకాశముంది.




**బీజేపీతో పొత్తుకు...**

బీజేపీతో పొత్తుకు జగన్ ప్రయత్నించాలని నెల్లూరు జిల్లాకు చెందిన కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. ఎందుకంటే ఆయన క్షేత్రస్థాయిలో జరిగిన విషయాలను పసిగట్టి ఆ కామెంట్స్ చేసి ఉండవచ్చు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటే కేంద్రంలో అధికారంలో ఉండటంతో ఎలక్షనీరింగ్ కు కూడా ఇబ్బందులుండవన్న అభిప్రాయం కావచ్చు. ఎన్నికలో తమ హవా కొనసాగాలంటే బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిందే నని ఆయన అన్నారు. అందులోనూ నిజం లేకపోలేదు. ఎందుకంటే బయట నుంచి మద్దతు ఇచ్చే కంటే ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ జగన్ మాత్రం ఒంటరిగానే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ డిమాండ్ నేతల్లో పెరిగితే ఏం జరుగుతందన్నది మాత్రం చూడాలి.

**రాజధాని అమరావతిపై...**


ఇక అమరావతిపై మాజీ మంత్రి జోగి రమేష్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆయన నేరుగానే చెప్పారు. అమరావతిలో అభివృద్ధి చేయకుండా మూడు రాజధానుల నినాదంతో వెళ్లి పదకొండు సీట్లకే పరిమితం కావడానికి రాజధాని అంశం కూడా ఒక కారణమని ఆయన చెప్పకనే చెప్పారు. అమరావతిని మార్చేది లేదని, రాజధానిగా కొనసాగిస్తామని, మూడు రాజధానుల స్థానంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళితేనే ప్రయోజనం ఉంటుందని జోగి రమేష్ అన్నారంటే ఆ విషయంలోనూ జగన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటారా? అన్నచర్చ జరుగుతుంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ నేతల్లో ఇదేరకమైన అభిప్రాయం ఉందంటున్నారు.

**ఉచిత హామీల విషయంలో...**

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కూడా ఉచిత హామీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల ప్రచారంలోనే తాను జగన్ కు చెప్పానని, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కల్పిస్తానని చెప్పాలని, మ్యానిఫేస్టోలో చేర్చాలని చెబితే అందుకు జగన్ అంగీకరించలేదన్నారు. ఫలితంగా చంద్రబాబు ఆ నినాదం అందుకుని విజయం సాధించారని కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. 2014 ఎన్నికల్లోనూ రైతులకు రుణమాఫీ విషయంలో హామీ ఇవ్వాలని కోరామని, అప్పుడు కూడా జగన్ అంగీకరించకపోవడంతో పార్టీ ఓటమిపాలయిం దని, ఉచిత హామీల విషయంలో ఈసారి జగన్ తన వైఖరి మార్చుకోక తప్పదంటున్నారు. ఎందుకంటే అధికారంలోకి రావాలంటే ఉచిత హామీలు ఇవ్వాలని నేతలు ఖచ్చితంగా వత్తిడి తెస్తారన్నది వాస్తవం. ఈసారి అధికారంలోకి రాకుంటే ఇబ్బందులు తప్పవని అందుకు చంద్రబాబుకు మించి హామీలు ఇవ్వాలని జగన్ పై వత్తిడి తెస్తారన్నది వాస్తవం.

# వైరస్ ముఖం చాటేస్తుంది.. నిజంగా ఇది గుడ్ న్యూస్ కదా?

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ లో కరోనా వైరస్ వ్యాప్తి క్రమంగా తగ్గుతుంది. యాక్టివ్ కేసులు కూడా క్రమంగా తగ్గుతున్నాయి. వైరస్ వ్యాప్తి నెలరోజుల్లోనే తగ్గడం ప్రారంభించిందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోల్చుకుంటే కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నది గణాంకాలు చెబుతున్నాయి. రోజు వారీ కేసులు తగ్గడంతో పాటు యాక్టివ్ కేసులు తగ్గుతుండటంతో పాటు కరోనా వైరస్ సోకి కోలుకునే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో క్రమేపీ కరోనా కనుమరుగవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.



**ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువగా...**

ప్రధానంగా కేరళ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లోనే ఎక్కువగా నమోదవుతున్నాయి. అక్కడ ఉండే జనసాంద్రతతో పాటు వాతావరణ పరిస్థితులు వైరస్ పెరగడానికి కారణాలుగా చెబుతున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో కరోనా కేసుల సంఖ్య నామామాత్రంగానే నమోదవుతున్నాయి. అయినా భారత ప్రభుత్వం మాత్రం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసి అన్ని రకాలుగా ముందు జాగ్రతలు పాటించేలా చేసింది. కోవిడ్ వార్డులను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఔషధాలను కూడా సిద్ధం చేసింది.

**ఇరవై నాలుగు గంటల్లో...**

గడిచిన ఇరవై నాలుగు గంటల్లో దేశ వ్యాప్తంగా 163 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా ఢిల్లీలో ఒక్కరోజే 65 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. తర్వాత 51 కేసులు రాజస్థాన్ లో నమోదయ్యాయి. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ యాక్టివ్ కేసుల సంఖ్య 6,483కు పడిపోయిందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

వీటిలో అత్యధికంగా కేరళలో 1,384, గుజరాత్ లో 1,105, పశ్చిమ బెంగాల్ లో 747, కర్ణాటకలో 653, ఢిల్లీలో 620 కేసులున్నాయి. ఇరవైనాలుగు గంటల్లో నలుగురు మరణించారు. కేరళ, ఢిల్లీ లో ఇద్దరు, మహారాష్ట్రలో ఇద్దరు కరోనాతో చనిపోయారు. దీంతో కరోనాతో ఇప్పటి వరకూ ఈ ఏడాది మరణించిన వారి సంఖ్య 113కి పెరిగిందని వైద్యాధికారులు తెలిపారు.

## రెయిన్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ రెండు రాష్ట్రాల్లో వానలు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో మరో వారం రోజుల పాటు వర్షం పడే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు విస్తరిస్తుండటంతో పాటు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటంతో భారీ వర్షాలు మరింతగా పడే అవకాశముందని చెప్పింది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో భారీ వర్ష పాతం నమోదయ్యే అవకాశముందని, అలాగే పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే రాయలసీమలోని నాలుగు జిల్లాలైన చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడపలలో తేలికపాటి జల్లులతో పాటు మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

**ఐదు రోజులు భారీ వర్షాలు...**

తెలంగాణలోనూ భారీ వర్షాలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపింది. అనేక జిల్లాల్లో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా తెలిపింది. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రధానంగా తెలంగాణలో ఉష్ణోగ్రతలు కనిష్టంగా తగ్గుతాయని, చెప్పింది. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఐదు రోజులు ఉక్కపోత వాతావరణం నెలకొంటుందని తెలిపింది. గత కొద్ది రోజులుగా చలి వాతావరణం ఉన్న తెలంగాణలో రానున్న ఐదు రోజుల్లో ఉక్కపోత ఉంటుందని, ఫ్యాన్, ఏసీల వాడకం పెరిగే అవ

**ఈ జిల్లాల్లో...**

తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని తెలిపింది. అయితే ఈరోజు మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లో అధిక వర్షాలు నమోదవుతాయని, మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని కూడా హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది. కొన్ని చోట్ల వడగళ్ల వాన కూడా కురిసే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా రైతులు సాగుకు అనుకూలమైన వర్షం పడుతుండటంతో అన్నదాతలు ఖరీఫ్ పనులు ప్రారంభించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. విత్తనాలు నాటేందుకు ఇది సరైన సమయమని చెబుతున్నారు.

## ఇద్దరికీ పెళ్లయింది.. శీతల్ హత్యకు అదే కారణం.. మద్యం తాగిన తర్వాత?

**హైదరాబాద్ పెన్ పవర్:**హర్యానా మోడల్ శీతల్ మర్డర్ మిస్టరీ వీడింది. శీతల్ ను ఆమె ప్రియుడు చంపేశాడన్న నిర్ధారణకు పోలీసులు వచ్చారు. శీతల్ ను పెళ్లి చేసుకోవాలని వత్తిడి తీసుకు రావడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. ఆమె ప్రియుడు సునీల్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఇద్దరికీ పెళ్లయింది.శీతల్ కు పెళ్లయి భర్త ఒక బిడ్డ ఉండగా, ఆమె ప్రియుడు సునీల్ కు పెళ్లయి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. పెళ్లి చేసుకోవాలన్న బలవంతం చేసినన్నదుకే సునీల్ శీతల్ చౌదరిని హతమార్చారని చెబుతున్నారు.

**ప్లాన్ పక్కాగానే...**

శీతల్ ను హత్య చేసి మృతదేహాన్ని కారులో పడేసి కారుతో పాటు కాల్వలోకి తోసేస్తే అది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించవచ్చని సునీల్ ప్లాన్ వేశాడు. అయితే సునీల్ ప్లాన్ వికటించింది. అంతకు ముందు ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో పాటు శీతల్ మెడపై బలమైన గాయాలు ఉండటంతో పోలీసులకు అనుమానం వచ్చి ఆమెను ఎవరో హత్య చేశారని భావించి ఆ దిశగా దర్యాప్తు కొనసాగించారు. శీతల్, సునీల్ గతంలో ఒక హోటల్ లో పనిచేసేవారు. ఇద్దరికీ అక్కడే పరిచయమయింది. ఇద్దరికీ వివాహయినా ఆరేళ్లు గా తమ వివాహేతర సంబంధాలను కొనసాగిస్తున్నారు.

# హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!



**హైదరాబాద్ పెన్ పవర్:**హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# మాగంటి వారసులకు టిక్కెట్ అవకాశం లేదా? పోటీ కోసం ఆశావహులు పెరిగారా?




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల మరణించారు. ఆయన అకాల మరణంతో జూబ్లీ హిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. దీంతో తెలంగాణలో ఉప ఎన్నికల హీట్ మొదలయింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2014లో టీడీపీ నుంచి, 2018, 2023 నుంచి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఆయన మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గాన్ని ఆయన కుటుంబంలో టిక్కెట్ ఇచ్చే అవకాశం తక్కువగానే కనిపిస్తున్నాయి. అందుకే వేరే వారికి ఉప ఎన్నికలో సీటు ఇస్తారన్న ప్రచారం జరుగుతుంది. సహజంగా ఎమ్మెల్యే ఆకస్మికంగా మరణిస్తే కుటుంబ సభ్యులు పోటీ చేస్తే ఎన్నిక ఏకగ్రీవం కావడం మామూలుగా జరుగుతుంది.

**వారు పోటీ చేయకుంటే...?**

అయితే ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా మాగంటి కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. వారు కూడా రాజకీయాల్లో మాగంటి వారసత్వాన్ని కొనసాగించేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే వేరే వారికి టిక్కెట్ ఇస్తే మిగిలిన పార్టీలు కూడా పోటీకి దిగే అవకాశముంటుంది. అందుకే ఇప్పటి నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి నుంచే అభ్యర్థులను సిద్ధం చేస్తున్నాయి. బీఆర్ఎస్ తమ అడ్డాగా భావించిన జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలలో గెలవాలని భావిస్తుంది. ఇందుకోసం పీజేఆర్ కుమారుడు విష్ణువర్థన్ రెడ్డి పేరును పరిశీలిస్తుంది.

**అవగాహన కుదిరితే...**

ఇక కాంగ్రెస్ పార్టీలో గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ కూడా తనకు టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇప్పుడు ఎంఐఎంతో సఖ్యత ఉండటంతో ఈసారి గెలుపు తథ్యమని అజార్ భాయ్ భావిస్తున్నారు. ఇక శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. 2014 ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఎంఐఎం నుంచి పోటీ చేసి దాదాపు నలభై వేల కు పైగానే ఓట్లు సాధించారు. ఇక పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి కూడా తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుంటే గెలుపు తథ్యమని భావిస్తుండటంతో పోటీ ఎక్కువయిందంటున్నారు.

**కూటమిగా పోటీ చేస్తే...**

భారతీయ జనతా పార్టీకి హైదరాబాద్ నగరంలో మంచి పట్టుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే వస్తున్న ఈ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలనుకుంటోంది. ఏపీలో టీడీపీ తో పొత్తులో ఉండటం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు కలిసివస్తుందని కమలనాథులు అంచనా వేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని నిలబెట్టగలిగితే విజయం తమదేనన్న ధీమాలో ఉన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దీపక్ రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నా మరొక కొత్త పేరు కమ్మ సామాజికవర్గానికి చెందిన ఒకపారిశ్రామిక వేత్త పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చంద్రబాబుతో భేటీ అయినప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కూడా చర్చించినట్లు తెలిసింది. మొత్తం మీద మూడు పార్టీ తమదైన వ్యూహాలతో ఉప ఎన్నికకు సిద్ధమవుతున్నాయి.

# తెలంగాణలో రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఎస్ఈ

- లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఎస్ఈ
- రూ.80 వేలు స్వీకరిస్తూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టివేత
- మహబూబాబాద్ జిల్లా టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ జనగాం నరేష్‌పై కేసు నమోదు
- కురవి, మరిపెడ సబ్ డివిజన్ల ఒప్పందాల రెన్యువల్ కోసం ఈ అక్రమం
- ఇప్పటికే రూ.20 వేలు తీసుకున్నట్లు వెల్లడి
- ఎవరైనా లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ఏసీబీ సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొరడా ఝుళిపిస్తోంది. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఒక విద్యుత్ శాఖ ఉన్నతాధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ సర్కిల్ పరిధిలోని తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఆపరేషన్స్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా పనిచేస్తున్న జనగాం నరేష్, ఒక ఫిర్యాదుదారుని నుంచి లంచం డిమాండ్ చేశారు. కురవి మరియు మరిపెడ సబ్-డివిజన్లకు సంబంధించిన ప్రస్తుతం అమల్లో ఉన్న అంగీకార పత్రాల ఒప్పందాలను యథాతథంగా కొనసాగించేందుకు అధికారికంగా సహకరించేందుకు గాను ఆయన మొత్తం రూ. 1,00,000 లంచం అడిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే రూ. 20,000 ముడుపులు స్వీకరించిన నరేష్, మిగిలిన రూ. 80,000 బుధవారం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ బృందం, నరేష్‌ను లంచం డబ్బులతో సహా అదుపులోకి తీసుకుంది. ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందుకోసం తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు డయల్ చేయాలని సూచించారు. అంతేకాకుండా, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB), అధికారిక వెబ్‌సైట్ (https://acb.telangana.gov.in) ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు భరోసా ఇచ్చారు.

# "ఆపరేషన్ సింధు"ను ప్రకటించిన విదేశాంగ శాఖ: ఇరాన్‌లో చిక్కుకున్న 110 విద్యార్థులు తరలింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం తీవ్రరూపం దాల్చడంతో, ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు భారత ప్రభుత్వం "ఆపరేషన్ సింధు"ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం అట్టుడుకుతున్న నేపథ్యంలో, పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా, ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న అర్మేనియాకు చేరుకున్న 110 మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీరంతా అర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. ఈ విద్యార్థుల బృందం జూన్ 19న, అంటే రేపు తెల్లవారుజామున, న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు.

ఇప్పటికే టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులకు కీలక సూచనలతో ఒక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే టెహ్రాన్‌ను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. ఇంకా ఎంబసీని సంప్రదించని వారు వెంటనే అధికారులతో సంప్రదించాలని కోరింది.

**మోదీ ప్రభుత్వంపై ప్రశంసలు**


విదేశాల్లో ఆపదలో చిక్కుకున్న తమ పౌరులకు అండగా నిలవడంలో భారతదేశం ఎప్పుడూ ముందుంటుందని మరోసారి స్పష్టమైంది. ఇరాన్‌లోని యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తరలించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న భారత పౌరుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వం వేగంగా స్పందించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులను మొదట ఇరాన్‌లోని సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారి భద్రత, బాగోగుల గురించి స్థానిక సమాజ పెద్దలతో చర్చలు జరిపారు. అనంతరం, చాలా మందిని సరిహద్దులు దాటించి అర్మేనియాకు చేర్చి, అక్కడి నుంచి వారిని స్వదేశానికి పంపించారు. ఈ మొత్తం ప్రక్రియను ప్రభుత్వం ఒక "మిషన్ మోడ్"లో చేపట్టింది. గత 11 సంవత్సరాలుగా భారతదేశ విదేశాంగ విధానంలో దౌత్యం, చర్చలతో పాటు, విదేశాల్లోని తమ పౌరుల భద్రతకు ముప్పు వాటిల్లినప్పుడు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడం కూడా ఒక భాగంగా మారిందని పరిశీలకులు పేర్కొంటున్నారు. సంఘర్షణలు, సంక్షోభాలు లేదా విపత్తుల సమయంలో, మోదీ ప్రభుత్వం వేగం, కరుణ, కచ్చితత్వంతో వ్యవహరించింది. సహాయక, తరలింపు చర్యలు "దేశమే ప్రథమం" అనే విధానానికి నిదర్శనంగా నిలిచాయి.

## సెల్‌ఫోన్ అప్పగించాలన్న ఏసీబీ నోటీసులపై స్పందించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు. విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు. అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు. ట

## హబ్సిగూడలో దారుణం.. మతిస్థిమితంలేని చిన్నారిపై లైంగిక దాడి





**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్?లో దారుణం..అమానవీయ సంఘటన.. మతిస్థిమితంలేని చిన్నారిపై లైంగిక దాడి..చికిత్సకోసం వచ్చిన బాలికపై డాక్టర్ వికృత చేష్టలు. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హబ్సిగూడలో ఓ బాలికపై డాక్టర్ లైంగిక దాడి ఘటన బుధవారం (జూన్ 18) వెలుగులోకి వచ్చింది.. వివరాల్లోకి వెళితే.. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైబ్రెంట్ వింగ్ చిల్ట్రన్ డెవలప్ సెంటర్ కేర్ డాక్టర్ రంజిత్ నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మానసికం ఎదుగుదల లేని నాలుగేళ్ల చిన్నారికి నాలుగు నెలలుగా హబ్సిగూడ వైబ్రెంట్ వింగ్స్ లో వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో బాలికపై లైంగికదాడి చేశాడని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఓయూ పోలీసులు.. బాలికను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే రంజిత్ డాక్టర్ కాదని..వారిని నమ్మించి దారుణానికి పాల్పడ్డాడని ఆరోపిస్తోంది బాలిక తల్లి.

## గచ్చిబౌలి వెళ్లే వారికి గుడ్ న్యూస్..జూన్ 28న పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభం




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో మరో ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానుంది. శిల్పా లే ఔట్ ఫేజ్ 2 ఫ్లైఓవర్ ను జూన్ 28 న ప్రారంభించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు నిర్మించిన బై డైరెక్షనల్ ఫ్లైఓవర్ కు దివంగత కాంగ్రెస్ నేత పి. జనార్ధన్ రెడ్డి(పేజేఆర్) పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రారంభోత్సవం వరకు ఫ్లై ఓవర్ పెయింటింగ్, లైటింగ్ తో పాటు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఫ్లై ఓవర్ ఓపెన్ అయ్యాక ఐటీ ఏరియాలో ట్రాఫిక్ సమస్యలు తొలిగిపోనున్నాయని మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగర పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జీహెచ్ఎంసీ కట్టుబడి ఉందని చెప్పారు.ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి వరకు 1.2 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ ఫ్లై ఓవర్?కు రూ. 178 కోట్లు ఖర్చు పెట్టారు. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ దగ్గర ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పుతాయి.

## పని ఒత్తిడి తట్టుకోలేక చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** పని ఒత్తిడి తట్టుకోలేక చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం(జూన్18) హీలియం గ్యాస్ పీల్చుకొని సూసైడ్ చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. మణికొండలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చార్టర్డ్ అకౌంటెంట్ గా జాబ్ చేస్తున్న సురేష్ రెడ్డి (28) బుధవారం కొండాపూర్ రాజేశ్వరీ కాలనీలో సర్వీస్ అపార్టుమెంట్ లో ఆత్మహత్య చేసుకున్నాడు. జూన్ 16న తన చెల్లెలి ఇంటికి పోతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన సురేష్ రెడ్డి..బుధవారం రాజేరాజేశ్వరి కాలనీలోని తన రూంలో హీలియం గ్యాస్ లీక్ చేసి ఊరిరాడకుండా తలకు కవర్ కట్టుకొని బలవన్మరణానికి తెలుస్తోంది. సురేష్ రెడ్డి రూంలో హీలియం గ్యాస్ సిలిండర్, సూసూడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. పనిఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ లో సురేష్ రెడ్డి రాసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి.. నాలుగు కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు గుర్తింపు!



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా ఇటీవల కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ తాజా కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు కొత్త ఉపరకాలే (సబ్ వేరియంట్లు) కారణమని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) నిర్ధారించింది. జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు వ్యాక్సిన్‌ల సామర్థ్యాన్ని అంచనా వేయడంలో ఉపయోగపడతాయని వారు తెలిపారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల నమూనాలను విశ్లేషించినప్పుడు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలు వెలుగులోకి వచ్చినట్లు ఎన్ఐవీ-పుణె డైరెక్టర్ డాక్టర్ నవీన్ కుమార్ వివరించారు. "మేము వీటిని ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. మొదట్లో జేఎన్.1.16 వేరియంట్ వల్ల కేసులు పెరిగినా, ఈ ఏడాది మే నెల నుంచి ఎక్స్ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఎల్ఎఫ్.7, ఎల్‌పీ.81.2 అనే రెండు వేరియంట్లు కలిసి ఎక్స్ఎఫ్‌జీగా రూపాంతరం చెందాయి" అని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి జన్యుక్రమాన్ని విశ్లేషించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని ఆయన చెప్పారు.

ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచి దేశంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,483 కొవిడ్-19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు కరోనా కారణంగా 113 మంది మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉండగా, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వైరస్ వ్యాప్తి అధికంగానే ఉంది.అయితే, ప్రస్తుతానికి ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, బాధితులు ఎక్కువగా ఇళ్లలోనే ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వ్యాధి లక్షణాలు స్వల్పంగా ఉండటంతో ఆసుపత్రులలో చేరేవారి సంఖ్య తక్కువగానే ఉందని తెలుస్తోంది. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## నకిలీ కరెన్సీ కేసులో విదేశీయుడికి బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నో.. కీలక వ్యాఖ్యలు

- నకిలీ కరెన్సీ కేసులో విదేశీ నిందితుడికి సుప్రీంకోర్టులో చుక్కెదురు
- బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం
- ఇలాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు పెను విఘాతమని తీవ్ర వ్యాఖ్యలు
- నిందితుడి నుంచి రూ.8 లక్షల నకిలీ నోట్లు, పరికరాలు స్వాధీనం
- నిందితుడు పరారయ్యే అవకాశం ఉందని కోర్టు ఆందోళన వ్యక్తం
- నేరం రుజువైతే దీర్ఘకాల శిక్ష పడే అవకాశం ఉందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించి చలామణి చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు గండి కొట్టే ప్రయత్నం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న విదేశీయుడికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో అరెస్టయిన అతడికి బెయిల్ మంజూరు చేయడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఇటువంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని, ఇలాంటి వ్యక్తికి బెయిల్ ఇవ్వడం సరైంది కాదని స్పష్టం చేసింది.

బల్గేరియా దేశానికి చెందిన రుస్లన్ పెట్రోవ్ మెతోదివ్ అనే వ్యక్తి భారత్‌లో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నాడన్న సమాచారంతో ఢిల్లీ పోలీసులు 2023లో అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో నిందితుడి నుంచి పెద్ద మొత్తంలో రూ. 500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుందని అంచనా. దీంతో పాటు, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర పరికరాలను కూడా పోలీసులు సీజ్ చేశారు.ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నిందితుడు మొదట ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, హైకోర్టు అతడి పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో రుస్లన్ పెట్రోవ్ సుప్రీంకోర్టు తలుపు తట్టాడు.

**సుప్రీంకర్టు తీవ్ర వ్యాఖ్యలు**

రుస్లన్ పెట్రోవ్ బెయిల్ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇలాంటి నేరాలు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నిందితుడిని పోలీసులు రూ.8 లక్షల నకిలీ కరెన్సీతో పట్టుకున్నారు. అతడిపై మోపబడిన నేరారోపణలు చాలా బలంగా ఉన్నాయి. ఒకవేళ నేరం రుజువైతే, అతడికి దీర్ఘకాలిక జైలుశిక్ష పడే అవకాశం ఉంది" అని కోర్టు పేర్కొంది.

ఇంతటి తీవ్రమైన నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తే, అతడు సాక్ష్యాలను తారుమారు చేసే లేదా దేశం విడిచి పరారయ్యే అవకాశం ఉందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. "ఇలాంటి పరిస్థితుల్లో నిందితుడి అభ్యర్థనను ఆమోదించడం ఎంతమాత్రం సరికాదు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. నకిలీ కరెన్సీ చెలామణి దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పు వాటిల్లేలా చేస్తుందని, ఇలాంటి కార్యకలాపాలను ఉపేక్షించలేమని కోర్టు తేల్చి చెప్పింది.